క్లుప్తంగా

శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



సిద్ధరామప్ప కొలను పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈఓ ఎస్ లవన్న అధికారులతో కలిసి శనివారం సిద్ధరామేశ్వరకొలనును పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ ఉగాది మహోత్సవాల్లో కన్నడిగులు అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకోవడంతో పాటు సిద్ధరామేశ్వరకొలను కూడా సందర్శిస్తారన్నారు. కొలను వద్ద దృఢమైన బారికేడింగ్ వేయాలని ఆదేశించారు. మెట్ల మార్గంలో కూడా చిన్నచిన్న మరమ్మతులను వెంటనే ప్రారంభించాలన్నారు. పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అలాగే భద్రతా చర్యల్లో భాగంగా మొబైల్ సెక్యూరిటీ ప్రతి రోజూ కొలనును పరిశీలిస్తుండాలని సూచించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ, డీఏ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



ట్యాంకు కుళాయిలకు నీటి సరఫరాను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి

పగిడ్యాల: స్థానిక దేవనగర్ కాలనీలోని జీఎల్ఎస్ఆర్ ట్యాంక్‌కు సరఫరా చేసే మంచినీటి పైప్ తుప్పుపట్టి దెబ్బతింది. దీంతో తాగునీరు వృథాగా పోవడం గమనించిన పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి శనివారం మరమ్మతు పనులు చేయించారు. దెబ్బతిన్న పైప్ స్థానంలో కొత్త పైపులను అమర్చి ట్యాంక్‌కు నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా అధికారులు సకాలంలో స్పందించే వారు కాదని, ప్రస్తుతం వలంటీర్ల పుణ్యాన సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పనులు చేయిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

భూ రీసర్వే వంద శాతం పూర్తి

కొత్తపల్లి: మండలంలోని నందికుంట గ్రామంలో భూ సమస్యలు లేకుండా చేసేందుకు ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్‌గా జగనన్న భూ రక్ష పథకం ద్వారా భూ రీసర్వే కార్యక్రమం నిర్వహించింది. సర్వే పనులు 100 శాతం పూర్తయినట్లు పీఓఎల్ఆర్ డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న శనివారం తెలిపారు. నందికుంట గ్రామ పంచాయతీలో 1,028 మంది రైతులకు 1,536 ఎకరాల భూములు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. క్షేత్రసాయి రెవెన్యూ సిబ్బందితో సర్వే జరిపించామని వివరించారు. రైతులకు జగనన్న భూరక్ష పథకం కింద గుర్తింపు పత్రాలు అందించామని చెప్పారు. సర్వేలో రైతులకు ఏమైనా అభ్యంతరాలున్నా, అనుమానాలు ఉన్నా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



పాడె మోసుకెళ్తున్న గ్రామస్తులు

జూపాడుబంగ్లా: కొంత కాలంగా జూపాడుబంగ్లా ఆర్టీసీ బస్టాండులో భిక్షాటన చేస్తూ పొట్టపోసుకుని జీవనం సాగించే అనాథ మహిళ లక్ష్మీ(32) శనివారం బస్‌స్టాప్‌లోనే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్నా గ్రామస్తులు కులమతాలకు అతీతంగా ఆమె అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ మొట్టే బాలస్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు సోడా ఖలీల్, జంగాల శేఖర్, మరి కొంత మంది హిందూ సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు చేశారు.

వ్యవసాయ పనిముట్ల పంపిణీ



వ్యవసాయ పనిముట్లను ప్రారంభిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలపరిధిలోని నాగలూటి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం గ్రామ సర్పంచ్ ఉషారాణి చేతుల మీదుగా రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేశారు. ఏఓ పీరునాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యంత్ర సేవా పథకం కింద రైతులకు ఈ పనిముట్లను అందజేసినట్లు తెలిపారు. అలాగే సబ్సిడీపై సీహెచ్‌సీ గ్రూపులకు అందిస్తున్న ట్రాక్టర్, రోటావేటర్, నాగళ్లు తదితర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహకార సొసైటీ చైర్మన్ నాగతుల సిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబీరసూల్, నాయకులు చిన్న పుల్లారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

కరువు తీరా నీళ్లు

- నీటి వనరులు పుష్కలంగా ఉన్నా గతంలో పంటలకు నీరందని పరిస్థితి
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రిజర్వాయర్లు, చెరువులకు పుష్కలంగా నీరు
- రెండు పంటలు పండించుకుంటున్న రైతన్నలు
- అధిక దిగుబడులు సాధిస్తూ.. ఆదాయం గడిస్తున్న వైనం



తెలుగు గంగ కింద రైతులు సాగు చేసిన వరి పంట



వెలుగోడు రిజర్వాయర్ పుష్కలంగా ఉన్న నీరు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని నాలుగు ప్రధాన మండలాలైన ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో నీటి వనరులకు కొదవ లేదు. ఈ మండలాల్లో తెలుగుగంగ, కేసీ కెనాల్, జిల్లాలోనే అత్యంత పెద్దదైన సిద్ధాపురం చెరువు లాంటి ప్రాజెక్టులు, కాల్వలు చెరువులున్నాయి. ఇన్ని వనరులున్నా టీడీపీ పాలనలో పంటలకు నీళ్లు సక్రమంగా అందక పంటలు ఎడిపోయేవి. దీంతో రైతన్నలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకొని కన్నీళ్లు పెట్టేవారు. ఈ తరుణంలో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రైతులకు ఎనలేని సంతోషాన్ని తెచ్చిపెట్టింది. పుష్కలంగా వర్షాలు కురవడంతో పాటు రిజర్వాయర్లు, చెరువులను సకాలంలో నింపి రైతులకు కావాల్సిన నీరు సమృద్ధిగా నిల్వ ఉంచడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పుష్కలంగా నీటి నిల్వలు

తెలుగు గంగ నీటి సామర్థ్యం 18 టీఎమ్‌సీలు కాగా ప్రస్తుతం 14 టీఎమ్‌సీల నీరు నిల్వ ఉండడంతో రైతులకు రబీలో పుష్కలంగా నీరు అందుతుంది. తుంగభద్రలో నీటి ప్రవాహం అధికంగా ఉండడం వలన కేసీ కెనాల్ నిండుకుండలా ప్రవహిస్తోంది. సిద్ధాపురం చెరువులో ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉండిపంట కాల్వల ద్వారా రైతులకు కావాల్సిన నీరు సమృద్ధిగా అందుతోంది. ఇలా కరవు తీరా నీరు ఉండడంతో రైతులు ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటలో వేలాది ఎకరాల్లో వరి , మొక్కజొన్న, మినుము, తదితర పంటలు రైతులు సాగు చేస్తున్నారు. ఏడాదికి రెండు పంటలు సాగు చేసి అధిక దిగుబడి సాధించి, సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రబీలోనూ పుష్కలంగా పంటల సాగు

శ్రీశైలంనియోజకవర్గంలోని శ్రీశైలంమండలం మినహా నాలుగు మండలాల్లో రైతులు రబీలో కూడ పుష్కలంగా ఎన్నో పంటలు సాగు చేశారు. ఈ ఏడాది రబీలో పంటల తీరును పరిశీలిస్తే ఆత్మకూరు మండలంలో 1,500 ఎకరాల్లో వరి, 3130 ఎకరాల్లో మినుము, 800 ఎకరాల మొక్కజొన్న సాగు చేయగా, జొన్న 200 ఎకరాల్లో వేశారు. వెలుగోడు మండలంలో 4900 ఎకరాల్లో వరి, 800 ఎకరాలు మినుము , 600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేయగా, 700 ఎకరాల్లో మినుము పంటను సాగు చేస్తూ రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నారు. బండిఆత్మకూరు మండలంలో 2,400 ఎకరాల్లో వరి పంట , 1,200 ఎకరాల్లో జొన్న , 369 ఎకరాల్లో మొక్కజొన్న , 570 ఎకరాల్లో మినుము, 120 ఎకరాల్లో పొగాకు పంటను రైతులు సాగు చేశారు. మహానంది మండలంలో రబీలో 7,150 ఎకరాల్లో వరి, 1,500 ఎకరాల్లో మొక్కజొన్న , 1,200 ఎకరాల్లో అరటి, 2,150 ఎకరాల మినుము పంటను వేశారు.

విస్తారంగా పంటలు సాగు చేశారు



శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రైతులు విస్తారంగా పంటలు సాగు చేశారు. వెలుగోడు, ఆత్మకూరు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో విస్తారంగా వరి పంట సాగు చేస్తున్నారు. వర్షాలు పుష్కలంగా కురవడంతో అన్ని ప్రాజెక్టుల్లో నీరు నిల్వ ఉండి, రబీలో పంటలు సాగు చేసిన నష్టపోయే పరిస్థితి లేదు. పంటలు అధికంగా పండడం వలన రైతులు పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు.

– ఆంజనేయులు, ఏడీఏ, ఆత్మకూరు

ఎకరాకు 45 బస్తాల దిగుబడి



తెలుగు గంగ కేసీ కెనాల్ కింద ఈ ఏడాది పుష్కలంగా నీరు ఉండడంతో 20 ఎకరాల్లో వరి పంట సాగు చేశాం. వరి పంట ఆశించినంత స్థాయి కంటే అధికంగా దిగుబడి వచ్చింది. ఎకరాకు 45 బస్తాలకు పైగా పండింది. పంటలు దిగుబడి అధికంగా రావడంతో మా ఇంట సంతోషాన్ని తెచ్చి పెట్టింది.

– శివ, సంతజూటూరు

పుష్కలంగా నీరు ఉండడంతో మినుము సాగు చేశా



ఈ ఏడాది సిద్ధాపురం చెరువులో నీరు పుష్కలంగా ఉండడంతో మినుము పంటను సాగు చేశా. 10 ఎకరాల్లో ఈ పంటను వేయగా 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. బస్తా 7,200 రూపాయల చొప్పున విక్రయించా. ఈ ఏడాది రెండు పంటలు నీరు ఉండడం వలన మినుము, మొక్కజొన్న పంటలు వేస్తున్నాం. పంటలు బాగా పండుతున్నాయి.

– రమణయ్య, కొత్తరామాపురం

మధుసూదన్‌రావును గెలిపించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌రావుకు ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీలను, ఎంపీటీసీలను, కౌన్సిలర్లను ఎమ్మెల్యే ఆర్థర్ కోరారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన స్థానిక సంస్థల అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌రావుకు నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రతినిధులు ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా వాల్మీకులకు సీఎం వైఎస్ జగనన్న అవకాశం ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. సేవా గుణం కలిగిన వ్యక్తి డాక్టర్ మధుసూదన్‌రావు అని అన్నారు. అనంతరం మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. తన జన్మ స్థలం అల్లూరు గ్రామమేనన్నారు. నందికొట్కూరు నియోజకవర్గం నుంచి ప్రతి ఓటు నాకు వేయాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను కోరారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షకూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు దేశెట్టి సుమలత, ధర్మారెడ్డి, జాకీర్‌హుసేన్, సింగిల్ విండో చైర్మన్ హుసేనయ్య, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల రక్షణ మనందరి బాధ్యత

నందికొట్కూరు: వన్యప్రాణులను రక్షించే బాధ్యత మనందరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీత అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వన్యప్రాణులను, అడవులను కాపాడాల్సిన బాధ్యత అందరిదన్నారు. వన్యప్రాణ సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని చెప్పారు. అండవి జంతువులు అంతరించి పోకుండా రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు రామకృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు ఆహ్వానం పలుకుతున్న ఈఓ, అధికారులు, అర్చకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను శనివారం రాత్రి ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్.లవన్న, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామి అమ్మవార్లను దర్శించుకుని, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, అందజేశారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఆత్మకూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం పట్టణంలోని 16 వ వార్డులో జేసీఎస్ టౌన్ ఇన్‌చార్జ్ సుల్తాన్, కౌన్సిలర్ విజయచౌదరి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసను పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటును 1 ప్రాధ్యానత ఓటుగా వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు నాగరాజు, డీలర్ రమణ, రషీద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 12వ వార్డులో రెహమాన్ ఆధ్వర్యంలో తిమోతి, మౌలాలి , రషీద్, హరిప్రసాద్, సూర్యనారాయణ తదితరులు ప్రచారం నిర్వహించారు.

కొత్తపల్లి: ఈనెల 13న జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సుధాకర్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి కోరారు. శనివారం ముసలిమడుగు గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రాకి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కో–ఆప్టేడ్ సభ్యుడు షేక్ మహమ్మద్ గౌస్, సర్పంచు జమిలాబీ, ఎంపీటీసీ ముబీనాబేగం , మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, ఉపసర్పంచు నాగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వెలుగోడు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, మండల వైస్ ఎంపీపీ నసీరుద్దీన్ కోరారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నుపూస రవీంద్రారెడ్డి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ మార్చి 13న జరగబోయే ఎన్నికల్లో వెన్నుపూస రవీంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాదర్ వలి, రఫీ, పుల్లంరాజు, వేణు, షంషీర్ అలీ, గోవిందు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి



మిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసు

జూపాడుబంగ్లా: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆత్మకూరు ఆర్డీఓ దాసు సిబ్బందిని ఆదేశించారు. శనివారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంతో పాటు మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం గదులను ఆర్డీఓ పరిశీలించారు. గదుల్లో విద్యుత్, ఫ్యాన్లు, బాత్‌రూమ్‌లు, తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

మిడుతూరు: ఈ నెల 13న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను ఆత్మకూరు ఆర్డీఓ దాసు శనివారం పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిరాజుద్దీన్, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం శివజ్యోతి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా, మండల సర్వేయర్ కృష్ణుడు, ఆర్ఐ మహమ్మద్‌హుస్సేన్ పాల్గొన్నారు.

మహిళలు చట్టాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు

నందికొట్కూరు: మహిళలు చట్టాలను వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు అన్నారు. శనివారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో మహిళ దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు హక్కులను ఉపయోగించుకోవాలన్నారు. మహిళకు ఎలాంటి సమస్య వచ్చినా న్యాయ స్థానాలను ఆశ్రయించవచ్చని చెప్పారు. చట్టాలపై మహిళలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ, టౌన్ సీఐ విజయభాస్కర్, మెప్మా సీఎంఎం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు పదహారు రోజుల పండుగ



మొలకెత్తిన అంకురాలు

మహానంది: మహానంది క్షేత్రంలో ఆదివారం పదహారురోజుల పండుగను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వివాహదీక్ష, అంకుర విసర్జన చేసి రథసప్తమి రోజున ఆవాహన చేసిన రథాంగ దేవతలను స్వస్థానానికి పంపి ఉద్వాసన పూజలు చేస్తామని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. ఈ ఏడాది అంకురాలకు మొలకలు చక్కగా పెరగడం శుభదాయకమన్నారు. వచ్చే ఏడాది ఎలాంటి ఆటంకాలు లేకుండా పంటలు సమృద్ధిగా పండుతాయని పేర్కొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

కొత్తపల్లి: గ్రామాల్లో నీటిసమస్య తలెత్తకుండా చూస్తామని వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ) అన్నారు. శనివారం మండలంలోని ముసలిమడుగు గ్రామ శివారులోని తాగునీటి బావిని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కె.సుధాకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డిలతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడతూ గ్రామంలో నీటిసమస్య ఉండడంతో దానిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా బావిలో పూడికతీత పనులు, బావిలోతు పెంచేందుకు బ్లాస్టింగ్ పనులు చేయించామని చెప్పారు. వీటి తర్వత బావిచుట్టూ గోడ నిర్మాణం చేపట్టి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కో–ఆప్టెడ్ సభ్యుడు షేక్ మహమ్మద్ గౌస్, మాజీ వైస్ఎంపీపీ మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: వేసవిని దృష్టిలో మండలంలోని జూటూరు గ్రామ పంచాయతీ మజరా కోల్స్ ఆనందాపురం గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా బోరు బావి తవ్వించారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సహకారంతో బోరు బావి తవ్వించినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు నాయిని మద్దిలేటి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉపేంద్ర పాల్గొన్నారు.

కౌలు బకాయిల వసూళ్లకు ప్రత్యేక కమిటీ

మహానంది: మహానంది దేవస్థానానికి చెందిన భూముల కౌలు బకాయిల వసూళ్లపై ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిల వసూళ్ల కోసం సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. ఈ మేరకు ఏఈఓ ఎర్రమల మధు, ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడుతో పాటు మరో ఏడుగురు సిబ్బందితో ప్రత్యేక కమిటీ వేశారు. రోజూ గ్రామాల్లో పర్యటించి వసూళ్లు చేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. దేవస్థానానికి సుమారు 120 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు రూ. 50లక్షలకు పైగా కౌలుబకాయిలు రావాల్సి ఉంది. దీంతో ప్రత్యేక కమిటీ వేయడంతో ఉద్యోగులు ప్రతి రోజూ ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులకు నోటీసులు జారీ చేయడంతో పాటు బకాయిలు వసూలు చేస్తున్నారు.

పందుల బెడద నివారించండి

భూముల కౌలు బకాయిలకు వెళ్లిన దేవస్థానం సిబ్బందితో పలుగ్రామాల రైతులు వాగ్వాదానికి దిగుతున్నారు. దేవస్థానానికి చెందిన భూములలో పందుల సంచారం అధికంగా ఉండటంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అధికారులు స్పందించి పందుల బెడద లేకుండా చేయాలని తిమ్మాపురం గ్రామ రైతులు శనివారం రాత్రి సిబ్బందికి విన్నవించారు.

రోడ్డుపై అడవి పంది మృతి

మహానంది: మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో వ్యవసాయ కళాశాల ప్రధాన ద్వారం ముందు రోడ్డుపై శనివారం అడవిపంది కళేబరం కనిపించింది. నల్లమల సమీప గ్రామాల్లో ఇటీవల వన్యప్రాణుల మాంసం విక్రయిస్తుండటంతో అడవి పంది మృతి చెంది కనిపించడం చర్చనీయాంశమైంది. విషయం తెలుసుకున్న డీఆర్ఓ సుబ్బయ్య, ఎఫ్‌బీఓ ప్రతాప్‌లు అడవిపందికి అంత్యక్రియలు నిర్వహించారు.

నల్లమల ఘాట్‌లో ప్రమాదం

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని ఆత్మకూరు–గుంటూరు ప్రధాన రహదారిలోని రోళ్లపెంట వద్ద శనివారం స్కార్పియో అదుపు తప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. శైలక్షేత్రం నుంచి అనంతపురం వెళ్తుండగా రోళ్లపెంట ఘాట్‌లోని మలుపువద్ద వాహనం అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ చంద్రశేఖర్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా, కారులో ఉన్న మరో వ్యక్తి ఉమామహేశ్వరరెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు ఎస్ఐ కృష్ణమూర్తి, పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పోలీసు వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇరువురికి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తమ వాహనంలోనే కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

అగ్నిమాపక పరికరాల పంపిణీ

పగిడ్యాల/మిడుతూరు: మనబడి నాడు–నేడు పథకం కింద మొదటి విడతలో పగిడ్యాల మండలంలో ఎంపికైన 10 పాఠశాలలకు 17 అగ్నిమాపక రక్షణ పరికరాలు, మిడుతూరులో 17 పాఠశాలలకు 22 పరికరాలను ఎంఈఓలు సుభాన్, మౌలాలిపంపిణీ చేశారు. శనివారం మండల రిసోర్స్ భవనాల్లో విటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు.

బైక్ దొంగ అరెస్టు

నందికొట్కూరు: బైక్ దొంగ జాకీర్‌ను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ విజయభాస్కర్ తెలిపారు. శనివారం పట్టణంలోని కర్నూలు రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌ను వదిలేసి పారిపోతున్న జాకీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జాకీర్ స్వగ్రామం మిడుతూరు కాగా గతంలో ఇతని అల్లూరు రోడ్డులో బైక్ చోరీ కేసు నమోదైందన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కొత్తపల్లి: మండలంలోని సింగరాజుపల్లె గ్రామంలో మలిరెడ్డి ప్రకాశం అనేవ్యక్తి బస్టాండ్ సమీపంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచుకొని విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు చేసి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టుచేసి శనివారం ఆత్మకూరు జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న ఏడీ డాక్టర్ నాయక్

మహానంది: ప్రస్తుత పోటీ ప్రపంచంలో వ్యవసాయ విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడం ఎంతో అవసరమని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాలలో శనివారం విద్యార్థులకు యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఇరవై రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ ఎంఎస్ రాహుల్, డాక్టర్ రమేష్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాల యాజమాన్యం తప్పనిసరి

రైతులు పంటలు సాగు చేసే సమయంలో పంటకు పోషకాలను అందించాలని డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ సూచించారు. బుక్కాపురంలోని రైతుభరోసా కేంద్రంలో పంటలలో సస్యరక్షణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఎల్ విజయభాస్కర్, డాక్టర్ మాధవిలు ఎలుకల నివారణ, కీటకాల నివారణ, ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించారు.

సమస్యల చెంత.. వారపు సంత

- రహదారిపైనే సంత నిర్వహణ
- ఇబ్బందుల్లో వ్యాపారులు, వినియోగదారులు



సంత సమయంలో రహదారిపై ఆర్టీసీ బస్సు వెళ్తున్న దృశ్యం

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరులో ప్రతి శనివారం నిర్వహిస్తున్న వారపు సంత వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసిపోయి ఉంటుంది. స్థానికులతో పాటు పీరుసాహెబ్ పేట, చింతలపల్లి, ఖాజీపేట, దేవనూరు సుంకేసుల తదితర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి కూరగాయాలు, ఆకుకూరలు, పండ్లు, పూలు, తిరుబంఢారాలను కొనుగోలు చేస్తుంటారు. అయితే సంత నిర్వహించేందుకు ప్రత్యేకంగా స్థలం లేకపోవడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు కూడలి వరకు రహదారికి ఇరువైపుల దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో కొనుగోలు చేసేందుకు వచ్చిన జనసందోహంతో రహదారి కిక్కిరిసిపోయి రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. పైగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వారపు సంతకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు. స్థలం కేటాయిస్తే అందరికీ సౌకర్య వంతంగా ఉండటమే కాకుండా గ్రామ పంచాయతీకి సైతం ఆదాయం సమకూరుతుందని పేర్కొంటున్నారు.

గ్రామ పంచాయతీకి సర్వహక్కులు..

వారపు సంత నిర్వహణకు స్థలం కేటాయించడానికి సర్వ హక్కులు గ్రామ పంచాయతీకి ఉంటాయి. గ్రామ పంచాయతీ పరిధిలో స్థలం గుర్తించి, గ్రామ సభ తీర్మానం చేసుకొని వారపు సంత నిర్వహించుకోవడానికి వీలుంటుంది. దీంతో పంచాయతీకి ఆదాయం పెంచుకోవచ్చు.

– ఈఓఆర్డీ ఫకృద్దీన్

స్థలం కేటాయిస్తే బాగుంటుంది



వారపుసంతకు స్థలం కేటాయించేందుకు గ్రామ పంచాయతీ చర్యలు తీసుకోవాలి. కేటాయించిన స్థలంలో వ్యాపారులకు మౌలిక వసతులు కల్పించారు. వ్యాపారస్తులకు, వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– మహమ్మద్, వ్యాపారి

ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి...



రహదారికి ఇరువైపులా కూరగాయాలు, తినుబండారాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. నంద్యాల–నందికొట్కూరు, మిడుతూరు – ఓర్వకల్లు వెళ్లే వాహనాలు మిడుతూరు బస్టాండు కూడలి నుంచి వెళ్తుండటంతో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది.

– రామకృష్ణ, వినియోగదారుడు, చింతలపల్లి